# టూలెట్

అంగర వెంకట శివ ప్రసాదరావు

"రండి.... ఈ గదే ఖాళీగుంది. మేడమీద కాబట్టి గాలి బాగానే వేస్తుంది బాత్రూమ్ పక్కనేవుంది. లెట్రిన్ కిమట్టుకు కిందకి వెళ్ళాలి. ఇదుగో.... ఈ కిటికీ తీసుకుంటే వెలుతురు బాగా వస్తుంది ఇంటాయన విజయనగరంలో వుంటున్నారు.... ఈ మధ్యే ఈగది ఖాళీ అయింది" గది చూపిస్తూ అన్నాడు రామారావు

"మరి మీరు...." సుబ్బారావు

"నేను కింద.... అదుగో.... ఈ కిటికీలోంచి కనిపిస్తోందే .... ఆ వాటాలో అద్దెకుంటున్నాను

'అద్దె'

'ముప్ఫై అయిదు రూపాయలు. అంతకన్నా తక్కువకి యివ్వొద్దని యింటాయన చెప్పారు ఈగది ఎవరికో ఒకరికి అద్దెకిచ్చేసి వెళ్ళిపోదామనుకున్నారు కానీ . నిన్ననే అర్జంటుగా వాళ్ళ వూరినుంచి కబురొస్తే నాకీవిషయంచెప్పేసి వెళ్ళిపోయారు. నెలకోసారి అద్దెలు వసూలుచేసుకోడానికి వస్తూవుంటారు. మీకీ గది నచ్చినట్టేనా....'

గదిగోడలని పరిశీలిస్తున్న సుబ్బారావు రామారావువేపు తిరిగి 'ఎవరండీ ఈ రాంబాబు' అన్నాడు.

'ఆఁ....ఎవరో....ఇంతకుముందు వుండేవాళ్ళండి భావకవి అనుకుంటాను.... ఇంతకీ మీకీగది నచ్చినట్టేనా....' రామారావు

'ఆఁ.... గది నాలుగుమూలలా పరీక్షిస్తూ అన్నాడు సుబ్బారావు

'మీరు....వుద్యోగం చేస్తున్నారా?'

'లేదండి.... బి కాం చదువుతున్నాను మునువుండేగది ఖాళీ చేసెయ్యమని యింటివాళ్ళు అంటే'

'బ్రహ్మచార్లకి గదులు దొరకడం కష్టమే....' వ్యంగ్యంగా అన్నాడు రామారావు

'వాళ్ళు చాలా మంచివాళ్లండీ... వాళ్ళ పెద్దమ్మాయి పురిటికొచ్చింది.

ళ్లు చాలదనీ, గది ఖాళీ చెయ్యమన్నారు.'

'మీ నాన్నగారు ఏంచేస్తున్నారు' రామారావు.

పల్లెటూళ్ళో మాకు భూములున్నాయి అవి చూసుకుంటున్నారు.

రామారావు కిటికీదగ్గర నిలబడి కిందకి చూస్తున్నాడు

'ఇదుగోండి ఎడ్వాన్సు.... రేపు పుదయం వచ్చి దిగుతాను.'

'ఓ అలాగే.... కాని ఒక్క షరతు నవ్వుతూ అన్నాడు రామారావు

'ఏంవిటది?'

'రేపు మీరు మా ఆతిథ్యం స్వీకరించాలి....'

'మీకెందుకండీ శ్రమ. హొటల్లో భోంచేస్తాలెండి'

"అలాగంటే వీల్లేదు. ఒక్క పూట మాయింట్లో భోంచేస్తే అరిగిపోతారా!

"అదేం కాదండీ...."

'మరేం కారణాలు చెప్పకండి. రేపు పుదయమే మీ సామాన్లు తెచ్చేసుకోండి. పది గంటలకల్లా భోంచేసెయ్యొచ్చు. రేపైతే నేను వూళ్ళోనే వుంటాను."

"మీరు...."

పెద్దగా నవ్వి.... "ఇంతకూ నేనేంచేస్తున్నానో చెప్పలేదుకదండీ. నేనూ.... అం. సబ్బులకంపెనీలో పనిచేస్తున్నాను... వూళ్ళో తిరిగి ఆర్డర్లు బుక్ చేస్తాను." మళ్ళీ నవ్వాడు రామారావు.

* * *

"అరె! అప్పుడే వచ్చేసారే.... పంక్చువాలిటీ గొప్పగా మెంటేన్ చేస్తారన్నమాట" నవ్వుతూ అన్నాడు రామారావు.

"మళ్ళీ తొమ్మిది దాటితే మంచిది కాదట .."

భలేవారే, మీకు తిథులూ నక్షత్రాలూకూడ తెలుసన్నమాట."

ఆబ్బె నాకవన్నీ తెలీవండి. పిన్నిగారు చెప్పారు. అదే నేనింతకుముందు అద్దెకుండే యింటావిడ చెప్పారు"

"అం పైకెళ్ళి మీ సామాన్లు సర్దేసుకోండి గది కడిగింవేసాను నేనిప్పుడే పది నిముషాల్లో బైటకెళ్ళి వస్తాను" అంటూ గుమ్మందిగి వెళ్ళిపోయాడు రామారావు.

పంచె కట్టుకుని, పొట్టికోటు వేసుకున్న రామారావు నలభై ఏళ్ళు దాటకపోయినా దాటినట్లే కనపిస్తాడు అతను నవ్వినా నుదుటిమీద ముడతలు చెరిగిపోవు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్లు కనిపిస్తాడు చార్మినార్ సిగరెట్లు చెయిన్‌లా కాల్చుతాడు. అప్పుడప్పుడు సిగరెట్టు కాల్చినా ఎప్పుడూ వేలికి చురకంటుకునే వరకూ కాలుస్తాడు.

సుబ్బారావు చదువుకోవాలనే సదుద్దేశంతోనే పట్నం వచ్చాడు. బి. కాం. లో చేరిన అర్నెల్లకి గది మారే పరిస్థితి ఏర్పడింది మెదడుకి మేత దొరికతే, తెగేవరకూ ఆలోచిస్తాడు సుబ్బారావు. డబ్బున్న ప్రతి

వాడికి వున్న అలవాట్లు అతన్లోలేవు 'వాళ్ళ ఫాదర్ పంపించడేమోరా.. పూర్ ఫెలో" అనుకుంటారు అతని "పర్స్" తెరిచిచూడని క్లాస్‌మేట్స్. అతని ఖాళీపర్సంత ఖరీదుచెయ్యని "రోగ్స్" అతన్ని ఫూల్ చెయ్యాలని చూస్తారు! ఎన్నన్నా సుబ్బారావు పర్సిప్పి చూపెట్టలేదు నోట్లు మంచి నీళ్ళలా ఖర్చుపెట్టలేదు. "సుబ్బారావ్ ది గ్రేట్" అని యితన్నెవరూ అన్లేదు.

సామాన్లు సర్దుతున్న సుబ్బారావు మళ్ళీ ఆ గోడలవేపు చూసాడు. అతని నిన్నటి ఆలోచన యింకా తెగలేదు

ఎవరీ రాంబాబు పూర్ ఫెలో. తనలో తనేఅనుకున్నాడు సుబ్బారావు

కిటికీగూట్లో అద్దం, దువ్వెన, షేవింగ్ సెట్టు పెడుతూ ఈరాంబాబు గది ఖాళీచేసి వెళ్ళిపోయాడని చెప్పారాయన. ఈ లోకం వదిలేసి పోలేదుకదా! మళ్ళీ తనలో తనే అనుకున్నాడు సుబ్బారావు.

"ఏమిటోయ్! ఇంకా సామాను సర్దుతూనే వున్నావా! రా.. రావోయ్ ఆవతల మా ఆవిడ వడ్డన పూర్తయి పోవచ్చింది."

"ఇదుగో వచ్చేస్తున్నానండీ...." అతని వెనకే మేడమెట్లు దిగాడు సుబ్బారావు.

"జాగర్తోయ్.... కాస్త తలవంచుకునిరా.... లేకపోతే చూరు తగిలి చురుక్కుమంటుంది" పెద్దగా నవ్వుతూ అన్నాడు రామారావు.

ఆవిడ వంటింట్లోకి తప్పుకుంది.

"ఇదుగోనోయ్.... ఇది గది. అది వంటిల్లు. వంటిల్లంటే వంటమాత్రమే చేసుకునేయిల్లు. భోజనాలు అక్కడ లాభంలేదు. ఈ గదిలోనే భోజనాలు, పడకలు.... అదే గెస్టు రూము.... అన్నీయిదే" మళ్ళీ నవ్వుతాడు.

"అంతేనండీ టౌన్లో యిల్లు దొరకడం కష్టమే...."

'ఆఁ.. రావోయ్ కూర్చో వంట చల్లారిపోతుంది.' తను కూర్చుంటూ అన్నాడు రామారావు.

'ఇదేటోయ్ ఆ కలుపుకోడం సుబ్బరంగా భోంచెయ్యాలి ఇదుగో యిలావచ్చి ఆ కూర యిలావెయ్"

ఆమె వచ్చింది అతనికి వడ్డన చేస్తూంది

"నాకు చాల్లే అతనికింకాస్త వెయ్"

ఆమె సుబ్బారావువేపు వచ్చింది.

"అబ్బే వద్దండీ యిప్పటికే ఎక్కువైపోయింది.' కంచానికి చేతులు అడ్డంగా పెట్టుకు అన్నాడు సుబ్బారావు.

అసహాయంగా నిలబడిపోయింది ఆమె.

'ఆఁ చెప్పడం మర్చిపోయాను. ఈయనే మన మేడమీద గదిలో దిగారు చదువుకుంటున్నారు' కూరా అన్నం కలుపుకుంటూ అన్నాడు రామారావు.

'నమస్తే.... అందామనుకున్న సుబ్బారావు భోం చేస్తున్నట్టు జ్ఞాపకం వచ్చి ఆమెవేపు వోసారి చూసాడు. ఆమెకూడ అతనివేపు చూసింది.

సుబ్బారావు తలవంచుకుని భోం చేస్తు .. రామారావు అదృష్టవంతు డనుకున్నాడు

మంచంమీద పడుకున్న బాబు లేచి ఏడుపు మొదలుపెట్టేడు.

'వాడే.... మా సుపుత్రుడు.... అదుగో వీడు లేచాడు'

భోజనాలు పూర్తిచేసి చేతులు కడుక్కున్నా రిద్దరూ....

'ఇలాగొచ్చి ఈ మంచంమీద కూర్చోవోయ్....' మంచం మధ్యలో మఠం వేసుకు కూర్చుని అన్నాడు రామారావు

మంచం చివర్న కూర్చున్నాడు సుబ్బారావు

'సిగరెట్ కాలుస్తావేంటోయ్....' పక్క గూట్లోంచి చార్మినార్ పెట్టె తీసి అన్నాడు రామారావు

"అలవాటు లేదండీ...."

పెద్దగా నవ్వి.... "అదేంటోయ్ కాలేజీలో చదువుతూ సిగరెట్ అలవాటు లేకపోవడమేంటి!"

మౌనంగా తలవంచుకుని మంచం పట్టెడమీద చూపుడువేల్తో రాస్తున్నాడు సుబ్బారావు.

'ఇదుగో అగ్గిపెట్టె యిలా అందుకో' నోట్లో సిగరెట్టు పెట్టుకుని అన్నాడు రామారావు.

ఆమె వస్తుంది. అగ్గిపెట్టె తీసుకు వస్తుంది తనలో తనే అనుకుంటూ ఆమెని చూడాలనేకోర్కెతో తలెత్తాడు సుబ్బారావు.

ఆమె అగ్గిపెట్టె తెచ్చి రామారావు కిస్తూ సుబ్బారావువేపు బెరుగ్గా చూసింది

చూపు కలవగానే తడబడి కళ్ళు దించేసాడు సుబ్బారావు మళ్ళీ కళ్ళెత్తేసరికి ఆమె అక్కడ లేదు

రామారావు సిగరెట్ వెలిగించుకుని, పుల్ల ఆర్పేస్తూ ఎప్పటివో తన చిన్నప్పటి కబుర్లు చెప్పడం మొదలుపెట్టాడు.

ఏదో విషయం చెప్పి నవ్వుతూ, 'అమ్మా! అంటూ చేతిలో సిగరెట్ పీక కిందికి వదిలేసాడు.

కంగారుగా చూసాడు సుబ్బారావు

'ఏంలేదోయ్.... వేలు చురుక్కుమంది అంతే.... నవ్వుతూ అన్నాడు రామారావు

ఆర్పకుండా కిందపడేసిన సిగరెట్ పీకవేపే చూస్తున్నాడు సుబ్బారావు.

"నాన్నాలూ...." నవ్వుతూ తప్పటడుగులు వేసుకుంటూ వస్తున్న బాబు పిలిచాడు

వీణ మీటినట్లనిపించింది ఆ గొంతు. సుబ్బారావుకి. రామారావు గొంతులో నవ్వుతున్న జీవం కనిపిస్తుంది బహుశా బాబు తల్లిపోలికే [illegible]ంటాడు తనలో తనే [illegible]

కున్నాడు సుబ్బారావు.

చేతులు చాచి బాబుని దగ్గరకు తీసుకున్నాడు రామారావు బాబు సుబ్బారావువేపో చూస్తున్నాడు

"కొత్త మావయ్య బాబూ "బాబు కళ్ళలోని సందేహాన్ని తీర్చాడు రామారావు.

"మరైతే.... ఈ మావయ్య బిచ కత్తులూ.... బిళ్ళలూ యిత్తాడా....?'

'ఓ యిస్తాను బాబూ.... మరి నా దగ్గరకొస్తేనే....' చేతులు జాపుతూ అన్నాడు సుబ్బారావు

బాబుని పది నిముషాలు ఆడించి లేచాడు సుబ్బారావు. 'మరి వస్తానండీ.' బాబుని రామారావుకి అందిస్తు అన్నాడు.

"అలా గేనోయ్..."

వంటిల్లు దాటుతూ రామారావు చూడకుండా తలతిప్పి చూసాడు సుబ్బారావు. ఆమె చేటలో బియ్యం ఏరుతోంది.

* * *

సుబ్బారావు మేడమీదకొచ్చి ఏదో నవల చదువుతూ కూర్చున్నాడు. నవల చదవడంఆపి గోడవేపు చూశాడు.

ఆమెకేగాని పెళ్ళవకుండా వుంటే ఆమెని తప్ప మరెవ్వరినీ పెళ్ళి చేసుకోను.

రాం బాబు....

అంతవరకూ ఈ రాంబాబు ఎవరు? ఏమన్యాడీ రాంబాబనే ఆలోచనలు ఆగిపోయి, ఎవరీమె....? అన్న ప్రశ్న అతన్ని వేధిస్తోంది

పుస్తకంమూసి టేబిల్ మీద పడేసాడు. క్యాప్‌కాట్ వేసుకొని పడుకున్నాడు. ఆ రోజాదివారం. ప్రతి ఆదివారం భోజనంచేసి, పడుకోవడం అలవాటు. కళ్ళు మూసుకున్నాడు. కాని నిద్ర రావడంలేదు

ఎవరు....? రాంబాబుని అంతగా కదిలించిన ఆమె ఎవరు....? ఎంతగా కదిలిపోకపోతే గోడలమీద అంత పిచ్చిగా రాస్తాడు. ఆమె.... ఆమె.... ఈమె కాదుకదా!

రాంబాబుని అంతలా కదిలించినది.... రామారావు భార్యకాదుకదా ఛ.... తన ఆలోచనకి తనే తిట్టుకున్నాడు సుబ్బారావు.

"అయినా ఎందుక్కూడదు.." మనసు గోలపెట్టింది ఒకళ్ళ గురించి తప్పుగా అంచనావేయడం.. సుబ్బారావు ఆలోచించడం ఆపేసి గట్టిగా కళ్ళు మూసుకున్నాడు. అయినా చాలా చికాగ్గా వుంది

లేచి గోడమీద ఆ పిచ్చిపిచ్చి రాతలు చెరిపేద్దా మనుకున్నాడు కాని అతని మనసొప్పలేదు.

ఆమె.... ఈమె.... ఒకరే....

రాంబాబు పేరు చెరిపేసి తన పేరు రాసేసుకుందా మనుకున్నాడు సుబ్బారావు

కాని రాయలేదు ఆ రాతలు చెరపలేదు * * *

మర్నాడు వుదయం షేవ్ చేసుకుందామని కిటికీ దగ్గర కొచ్చిన సుబ్బారావు చూపు అప్రయత్నంగా రామారావింటివేపు పోయింది.

ఆమె అప్పుడే బాత్రూమ్‌లోంచి యింట్లోకి వెళుతోంది.

సుబ్బారావుకి పిచ్చెక్కినట్లయింది షేవ్ చేసుకుంటున్నా ఆమె మళ్ళీ పైకి వస్తుందేమోనని చూస్తాడు. గెడ్డం వొకటి రెండుచోట్ల తెగింది. స్నానంచేసి కాలేజీకి వెళిపోయాడు

సాయంత్రం కాలేజీనించి వస్తూ బిస్కట్లు. చాక్లెట్లు పట్టుకొచ్చాడు. మేడమీదకెళ్ళి గది తాళంతీసేసరికి బాబు మెట్లెక్కి 'మావయ్యా.. మావయ్యా..' అంటూ పైకొచ్చాడు.

బాబుని ఎత్తుకున్నాడు సుబ్బారావు బిస్కట్లు కావాలని బాబు గోలపెడుతున్నాడు.

"నీకు బిస్కట్లు కావాలా.. ?"

ఊం. ఇయ్యి మావయ్యా .!

"మరైతే నన్ను 'మావయ్య' అని పిలవకూడదు "

"ఊం . మావయ్యనే పిలుస్తాను. నాకు బిచకత్తులు కావాలి. "

"అలాగైతే యివ్వను.. నన్ను 'బాబాయ్' అని పిలుస్తేనే యిస్తా ."

"ఊం నే పిలవను. నాకు మావయ్యంటేనే యిష్టం!

"బాబాయ్ అని పిలుస్తేనే బిస్కట్లు, చాకెట్లు బోల్లు బొమ్మలు కూడ యిస్తా.."

"మరైతే నాకు యిమానం కొని పెడతావా.."

"ఓ తప్పకుండా మరి 'బాబాయ్' అని పిలుస్తావా

'ఓ' నవ్వుతూ అన్నాడు బాబు.

బాబుకి చాక్లెట్లు. బిస్కట్లు యిచ్చాడు సుబ్బారావు బాబు కిందకి వెళ్ళిపోయాడు

సుబ్బారావు కిటికీదగ్గర నిలబడ్డాడు అప్పుడే చీకటి పడింది. గదిలో లైటు వెయ్యలేదు ఆమె వాళ్ళింటి గుమ్మందగ్గర నిలబడింది.

బాబు చేతిలో బిస్కట్లు, బిళ్ళలూ చూసి తప్పన్నట్లు ముక్కుమీద వేలేసుకుంది బాబు మారాంచేస్తూ చేతులు వెనక్కి పెట్టాడు వాడి రెక్క పుచ్చుకుని ఆమె లోపలికి లాక్కెళ్ళింది

* * *

సుబ్బారావు ఆ యింట్లోదిగి అప్పటికే వారం రోజులైంది రోజూ సాయంత్రంపూట బాబు మేడమీదకి వచ్చి ముద్దుముద్దుగా కబుర్లుచెప్తూ చక్రాల్లాంటి కళ్ళు గుండ్రంగా తిప్పుతాడు సుబ్బారావు బిస్కట్లు, చాక్లెట్లు యిస్తే బాబక్కడే తినేస్తాడు- కిందకి పట్టికెళితే అమ్మ తంతుందంటాడు.

సాయంత్రం సుబ్బారావు యింటికి రాగానే బాబు మేడమీదకు వచ్చాడు బాబు చేతిలో ఏదో కాయ

తం వుంది బాబు కాయితం యిస్తూ 'అమ్మ యిమ్మంది' అన్నాడు

సుబ్బారావు కాయితంవిప్పి చదివాడు.

వారు రెండురోజుల క్రితం క్యాంపుకి వెళ్ళారు. పదిరూపాయలుంటే ఈ కాయితంలోనే కట్టి బాబు చేతికిచ్చి పంపించండి.

అడుగున సంతకంగానీ, పైన సుబ్బారావు పేరుగానీ, లేవు.

సుబ్బారావు ఆలోచించకుండానే పది రూపాయలనోటు ఆ కాయితంలోనే పెట్టి బాబు కిచ్చాడు

రామారావు క్యాంపు కెళ్ళాడట. అవసరానికి పది రూపాయలడిగింది ఎక్కడా ఆహ్వానం లేదు.

బహుశా అదే ఆహ్వానమేమో.... ఇవాళ రాత్రి వెళితే.... కొంపతీసి రామారావు వచ్చేస్తే.

ఎటూ నిర్ణయించుకోలేక గదిలో పచార్లు చేస్తున్నాడు సుబ్బారావు.

మరోసారి ఆమె వుత్తరం రాస్తే వెళ్ళవచ్చన్న నిశ్చయానికి వచ్చాడు సుబ్బారావు

మరో పదిరోజులు పోయాక మళ్ళా ఆమె బాబుచేత వుత్తరం పంపింది.

ఈమధ్య రామారావు వూరినుండి వచ్చి మళ్ళ వెళ్ళినట్లుంది.

సుబ్బారావులోని 'డబ్బుజాగ్రత్త మనిషి 'పైకి లేచాడు అనవరంగా డబ్బు ఖర్చుపెట్టొద్దని హెచ్చరించాడు.

సుబ్బారావు లక్ష్యపెట్టలేదు. వుత్తరంలో మరో కొత్తవాక్యం, అతన్ని వుత్సాహపరిచింది.

"వారు మరో రెండు రోజుల్దాకా రారు...."

దీన్లో అర్థమేంటి....? సుబ్బారావు ఆలోచిస్తున్నాడు.

వాచీ చూసుకున్నాడు. పదైంది

వద్దు. .వెళ్ళు.. వద్దు. .వెళ్ళు.. వద్దు....వెళ్ళు.... సుబ్బారావు వేళ్లు లెక్కపెట్టడం మానేసి మెట్లుదిగాడు

రామారావు యింటితలుపు వేసుంది గిరగా తీసుందేమోనని తోసాడు రాలేదు. గొళ్ళెం కొడితే....

ఛ .. తప్పేమో . . అనుకున్నాడు సుబ్బారావు

అవతల తలుపు తెరుస్తున్న చప్పుడు. సుబ్బారావుకి భయమేసింది. వెనక్కి తిరిగి పారిపోతేనో..

తలుపు తెరుచుకుంది ఎదురుగా ఆమె....కాదు.... ఆమె కాదు, అతను. రామారావు.... కోపంగా లేడు.... నవ్వుతున్నాడు ఆనవ్వులో ఎగతాళి

సుబ్బారావు వెనక్కి పడిపోతానేమో అనుకున్నాడు. నిలదొక్కుకున్నాడు

"ఏమిటోయ్.... ఈవేళప్పుడు వచ్చావ్....?" యింకా రామారావు మొహంమీద నవ్వు చెరగలేదు.

అబ్బే ... ఏం లేదండీ.... తల నొప్పిగా వుంటేనూ.... మీ దగ్గర అమృతాంజనంగానీ వుందా."

"అంతేనటోయ్ తలనొప్పేగా.. జ్వరమొచ్చినట్లు బెంబేలు పడిపోతా వేంటోయ్ వుందు యిస్తా.

అమృతాంజనంసీసా అందుకుంటున్న సుబ్బారావుకి రామారావు భుజంమీదుగా ఆమె మొహం కనిపించింది.

కొంపదీసి ఆమెగానీ దొరికిపోలేదుకదా! మనసులోనే అనుకుంటూ మేడ మెట్లెక్కాడు సుబ్బారావు.

ఆ రాత్రి సుబ్బారావు నిద్రపోలేదు అమృతాంజనం రాసుకోలేదు. జుత్తు పీక్కున్నాడు గోడమీద అక్షరాలు రాక్షసుల తలకాయల్లా కనిపించాయి

'రాంబాబు' తన గుండెల్లో రక్తాన్ని 'స్ట్రా'తో పీల్చేస్తున్నట్లనిపించిది సుబ్బారావుకి

ఛీ. పాడుబుద్ధి నాల్గోసారి అనుకున్నాడు

ఆమెని రామారావు తంతున్నాడేమో! రేపు వుదయం ఆమె శవం నూతిలో తేలుతుందేమో..

సుబ్బారావుకి పారిపోవాలనిపించింది. దుప్పటి మొహంనిండా కప్పుకుని పడుకున్నాడు క్యాంపుకాట్ కదిల్తే 'కిర్రు'మంటోంది. కిర్రుమన్నప్పుడల్లా తుళ్లిపడుతున్నాడు సుబ్బారావు.

'రాత్రి రెండు గంటలక్కామోసు. నిద్రపోయాడు బాగా తెల్లవారేక నిద్ర లేచాడు మేడదిగి కిందకి రావడానికి భయమేసింది సుబ్బారావుకి. ఆ రోజంతా పస్తు పడుకున్నాడు. బాబుకూడ మేడమీదకు రాలేదు.

రాత్రి చీకటిపడ్డాక బైటకెళ్ళాడు ఆకలి దంచేస్తుంటే . నాల్రోజుల వరకూ సుబ్బారావు పగలు పూర్తిగా గదిలో వుండడం మానుకున్నాడు. ఆ తరవాత మామూలుగా తిరుగుతున్నాడు

ఒకరోజు రాత్రి సెకండ్ షోకి వెళ్దామని బైల్దేరాడు. గుమ్మం దిగుతుంటే రామారావింట్లోంచి సన్నగా ఏడుపు వినిపిస్తోంది.

తనకెందుకులే ... అనుకుంటూనే ఆగిపోయాడు సుబ్బారావు

ఆమె ఏడుస్తోంది తలుపు సందులోంచి గదిలో దీపం వెలుతురు బైటపడుతోంది

ఆమె ఏడుస్తూ మధ్య మధ్య మెల్లగా మాట్లాడుతోంది. శ్రుతులు కుదరని వీణ మ్రోగినట్లు అనిపిస్తోంది మాటలర్థమవటం లేదు సుబ్బారావుకి.

సుబ్బారావు గుమ్మానికి దగ్గరగా వచ్చాడు. అతని గుండెలు దడదడ కొట్టుకున్నాయి. తలుపు సందులోంచి చూసాడు. ఆమె కనిపించటం లేదు రామారావు వీపు కనిపిస్తోంది.

'రాయ్....' రామారావు గొంతులో మునుపుండే జీరే.

'వద్దండీ....' ఆమె ఏడుస్తోంది.

"నీ ఏడుపు కట్టిపెట్టి ముందు రాయ్....' రామారావు చెయ్యెత్తాడు.

'ఏమైనా నేను రాయనండీ....' ఆమె పెన్ను విసిరేసింది.

రాయవూ.... రాయకపోతే దబ్బె బాగాగుస్తుందే.... నీ బాబు పంపిస్తా డనుకున్నావా" ఎడంచేత్తో ఆమె జుత్తుపట్టుకుని, కుడిచేత్తో తంతు న్నాడు.

ఆమె 'లబోదిబో' మని ఏడుస్తోంది

సుబ్బారావుకి షాక్ తగిలినట్లని పించింది. గబగబా మేడమీదకి వెళ్ళిపోయాడు

ఏం చెయ్యాలో అర్థంకావటం లేదు సుబ్బారావుకి. అసలెందుకు రామారావిలా చేస్తున్నాడు....!

రామారావుకి వుద్యోగం లేదా....!

ఆమెకాదా ఈ వుత్తరాలు రాసేది

కిటికీలోంచి చల్లటిగాలి వీచింది. నిప్పుల సెగలా అనిపించింది భళ్ళున కిటికీ తలుపులు వేసేసాడు సుబ్బారావు.

నిద్దర రావటంలేదు. గది తలు పులుకూడా వేసేసాడు. ముసుగు తన్ని పడుకున్నాడు. ఆలోచన్లు ముసురుతున్నాయి. సుబ్బారావు ఈ గదికొచ్చి క్లాసు పుస్తకం ఒక్కమారు కూడ తీయలేదు

తెల్లవారిపోయింది సుబ్బారావు అద్దం చూసుకున్నాడు. కళ్ళెర్రగా వున్నాయి గబగబా సామానంతా సర్దేసాడు గదికి తాళం వేయబోతూ ఏదో జ్ఞాపకంవచ్చి మళ్ళీ గదిలో కెళ్ళాడు.

మనిషి షర్టెల్లా వికృతంగా నవ్వుతూ కనిపించాయి గోడమీద అక్షరాలు అతకంతకీ పెద్దవైపో తున్నట్లనిపించాయి గది గోడలం తేసి అయిపోతాయేమో అని భయ పడ్డాడు సుబ్బారావు.

కిందపడేసిన బ్లేడుతో సున్నం గీసేసాడు రాంబాబు పిచ్చిగా రాసు కున్న రాతలు చెరిగిపోయాయి బ్లేడక్కడే పడేసి పైకొచ్చేసాడు సుబ్బారావు

రామారావింటి తలుపులు తీసే వున్నాయి గుమ్మంలోనే నవ్వుతూ ఎదురయ్యాడు రామారావు.

"ఏవిటోయ్.... వూరికెళు తున్నావా...."

'అవునండీ.... మా నాన్నగారికి వొంట్లో బాగోలేదట. ఇదుగోనండీ అద్దె ఇవిగో తాళాలు గది ఖాళీ చేసేస్తున్నాను.' సుబ్బారావు.

'గది ఖాళీ చేసెయ్యడవేం..? మళ్ళీ రావేంటోయ్.... నవ్వుతూనే అన్నాడు రామారావు.

"లేదండీ... యింత త్వరగా రాలేకపోవచ్చును." తలవంచుకునే అన్నాడు సుబ్బారావు.

ఆమె వంటింటి కిటికీలోంచి చూస్తుందని సుబ్బారావుకి తెలుసు. ధైర్యంగా ఆమె కళ్ళల్లోకి కళ్లుపెట్టి చూడలేకపోయాడు.

సుబ్బారావు సామాను పట్టించుకు వెళ్ళిపోయాడు. సుబ్బారావెక్కడికి వెళ్ళాడన్నది అనవసరం. ఆ తరవాతేం జరిగిందన్నదే అవసరం

* * *

"రండి.... ఈ గదే ఖాళీగుంది. మేడమీద కాబట్టి గాలి బాగానే వేస్తుంది బాత్రూమ్ పక్కనే వుంది లెట్రిన్‌కిమెట్టుకు కిందకి వెళ్ళాలి ఇదుగో.... ఈ కిటికీ తీసుకుంటే వెలుతురు బాగా వస్తుంది ఇంటాయన విజయనగరంలో వుంటున్నారు ఈ మధ్యే ఈ గది ఖాళీఅయింది. గది చూపిస్తూ అన్నాడు రామారావు.

గదిగోడలని పరిశీలిస్తున్న ఆ వ్యక్తి, రామారావువేపు తిరిగి "ఎవరండీ ఈ రాంబాబు" అని అడిగాడు

ఆం.. ఎవరో. యింతకుముందు వుండేవాళ్ళెండి భావకవి అనుకుంటాను.... ఇంతకీ మీకీగది నచ్చినట్టేనా...." అన్నాడు రామారావు.

---

# సమిధ

పెనుగొండ లక్ష్మీనారాయణ

కసిగా నే నిప్పుల కంఠంవిప్పి
గానంచేస్తే కడలిసైతం
శృతి కలుపుతూ హోరెత్తి
సంగీతిస్తుంది

పురిపిప్పి నే నర్తిస్తే
మయూరాలు సైతం
పరవశించిపోతూ
మైమరచి ఆడుతాయి

ఎలుగెత్తి నే పిలిస్తే
మూగవోయిన హృది సహితం
రాగజ్వాల లెగజిమ్ముతూ
విపంచికారవమై నినదిస్తుంది.

ఆనందంతో నేభావజలాన్ని వర్షిస్తే
బీడువడ్డ ఎడారి
హృదయాలు సైతం
చిగురించుట తధ్యం

పగబూని నే శత్రువును కాటేస్తే
ఫణీంద్రు సైతం
విస్తుపోయి చూస్తుంది

పంజాతో నే కొడితే
పడగెత్తిన క్రౌంచులు సైతం
నెత్తురులు కక్కుతూ
పడిపోక తప్పదు

జూలు విదిలించి నే
సమరానికి ధుమికితే
మృగరాజులు సైతం
మృత్యువుకు లోను కావాల్సిందే

నేను సామ్యవాద
గిరి శిఖరాన్నధిరోహించే
ప్రగతి పథగామిని

చీకటి చెరచీల్చే
చైతన్య జ్వాలా కిలను

సమ సమాజ సంస్థాపనే
ధ్యేయంగా రగిలించబడ్డ సమిధను